సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

మల్కాపురం: యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. విలువైన కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రగ్గుల వితరణ



ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న వారికి రగ్గులు పంపిణీ చేస్తున్న కీర్తి పట్నాయక్

మల్కాపురం: శ్రీదేవి విజ్ఞాన జోగి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లపై, బస్టాప్‌ల వద్ద జీవనం సాగిస్తున్న వారికి శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా చలి చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. అందుకే రోడ్లు,ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న వారికి రగ్గులు పంపిణీ చేశామన్నారు.

ఎకో వైజాగ్‌కు సహకరించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల పరిసర ప్రాంతాలనుశుభ్రం చేసి రంగవల్లులు వేశారు.విద్యార్థినులు వేసిన ముగ్గులను వార్డు కార్పొరేటర్ లావణ్య పరిశీలించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన దుస్తులు దరించడంతో పాటు చుట్టుపక్కల వాతావరణం పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.తద్వారా ఎకో వైజాగ్ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాల్సిందే..



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ సుధీర్

విశాఖ విద్య: ఆటోవాలాలు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఎంవీఐ సుధీర్ అన్నారు. ఎన్‌ఏడీ సెంటర్‌లో శుక్రవారం విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లే ఆటోలను తనిఖీ చేశారు. వాహనాలకు అన్ని రకాల ధృవీకరణ పత్రాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. తగిన ధృవీకరణ పత్రాలు లేని ఆటోలకు జరిమానాలను విధించి, డ్రైవర్లను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను రోడ్లపైకి తీసుకురావద్దన్నారు.

సంక్షేమ పథం.. ప్రగతి రథం

నాడు: పింఛను ఎప్పుడో వస్తుందో తెలియని పరిస్థితి. అర్హత ఉన్నా సంక్షేమ పథకాల కోసం జోనల్ కార్యాలయం లేదంటే జీవీఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. ప్రభుత్వ సాయం కోసం అధికార పార్టీ నాయకుల సిఫార్సు చేస్తేనే కానీ మంజూరుకు నోచుకోలేని అభాగ్యులెందరో....

నేడు: గడప వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తున్నాయి. ఠంఛన్‌గా సామాజిక పింఛన్లు చేతికందుతున్నాయి. దరఖాస్తులు పట్టుకొని ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. వలంటీర్ ఇంటికి వచ్చి అవసరమైన పత్రాలన్నీ తీసుకొని పథకం మంజూరు చేయిస్తున్నారు. రాజకీయ, ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండానే లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయి.

- సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా
- నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండ
- లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక ప్రయోజనం
- సాకేతపురం సచివాలయంలో రూ.13,81,70,126 లబ్ధి
- ప్రతీ ఇంటా వెల్లివిరుస్తోన్న ఆనందం
- గెడ్డల ఆధునికీకరణతో తీరిన డ్రైనేజీ సమస్య



దుర్గాపురం ముఖద్వారం



దుర్గాపురంలోని ప్రాథమిక పాఠశాల

విశాఖ విద్య: జీవీఎంసీ 57వ వార్డు పరిధిలోకి వచ్చే సాకేతపురం, దుర్గాపురం వాసులకు సంక్షేమ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. అభివృద్ధి పనులు సాఫీగా జీవనం సాగించేలా దోహదపడుతున్నాయి. నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్‌ఏడీ)కు ఆనుకుని ఉన్న ఈ రెండు కాలనీల్లో శాశ్వతమైన నిర్మాణాలు చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌ఏడీ అంగీకారం తప్పనిసరి. దీంతో కాలనీ వాసుల అవసరాల మేరకు మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అంతర్గత రహదారులు మెరుగుపర్చారు. గెడ్డల ఆధునికీకరణ ద్వారా డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టారు.

రూ.13.81 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి ..

పేద వర్గాలకు ఆర్థిక తోడ్పాటు అందించడం ద్వారా వారి కుటుంబాల్లో ఆనందం నింపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తోంది. సాకేతపురం సచివాలయం పరిధిలోని సాకేతపురం, దుర్గాపురం కాలనీ వాసులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వివిధ పథకాల కింద రూ.13.81 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వ చేయూత వల్ల కాలనీల వాసులు పురోభివృద్ధి దిశగా పయనిస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి



రూ. 40 లక్షలతో ఆధునికీకరించిన సాకేతపురం గెడ్డ



కాలనీలో నూతనంగా వేసిన రోడ్డు

పరోక్ష నగదు బదిలీ ద్వారా ప్రయోజనం ఇలా

సంక్షేమ పథకం	లబ్ధిదారులు	ప్రయోజనం(రూ.)
ఇంటి స్థలాలు	173	4,25,58,000
విద్యాకానుక	88	6,24,976
ట్యాబ్‌లు	10	1,32,220
జగనన్న తోడు	69	12,84,711
గోరుముద్ద	80	7,92,560
రేషన్	745	1,62,73,780

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ప్రయోజనం ఇలా

సంక్షేమపథకం	లబ్ధిదారులు	అందించిన మొత్తం(రూ.)
అమ్మ ఒడి	299	1,29,42,955
విద్యాదీవెన	175	61,10,046
వసతి దీవెన	142	22,63,472
రైతు భరోసా	88	37,26,150
పంటల బీమా	5	1,77,372
పంట రుణాలు	12	36,086
ఇన్‌పుట్ సబ్సిడీ	04	29,700
పెన్షన్ కానుక	215	1,90,01,750
సున్నా వడ్డీ	634	19,46,877
కాపు నేస్తం	27	12,45,000
ఈబీసీ నేస్తం	14	4,05,000
ఆరోగ్య శ్రీ	123	37,73,593
ఆరోగ్య ఆసరా	74	5,64,925
హౌసింగ్	131	58,54,120
వైఎస్సార్ బీమా	2	4,00,000
వాహన మిత్ర	41	12,10,000
చేదోడు	14	3,00,000
కోవిడ్ సాయం	650	6,50,000
జగనన్న తోడు(వడ్డీ)	54	24,765
మొత్తం		7,65,03,879

ఆర్థిక భరోసా ఇచ్చాయి



కుటుంబం గడవడానికి భర్తకు చేదోడుగా ఇంట్లోనే మిషన్ కుడతాను. పిల్లలిద్దరినీ ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నాను. అబ్బాయి రోహిత్‌కు అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి. డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా రూ.1.80 లక్షలు రుణం తీసుకున్నాం. సున్నా వడ్డీ రూ.14 వేలు చొప్పున మూడు సార్లు వడ్డీ రాయితీ వచ్చింది. ప్రభుత్వ పథకాలు మాకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయి.

– యాలకుల లక్ష్మి

స్వశక్తితో ముందడుగు



కుటుంబం గడవడం కోసం పదేళ్లుగా దుకాణం నిర్వహిస్తున్నాను. అప్పట్లో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడేవాళ్లం. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉన్నా సవ్యంగా రుణం వచ్చేది కాదు. రుణం తీసుకున్నా వడ్డీ రాయితీ లేదు. ఇప్పుడు నాలాంటి చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రుణం ఇస్తున్నారు. ఏటా వడ్డీ రాయితీ వేసి స్వశక్తితో ముందుకెళ్లేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది.

– ఎన్ని రాధాకుమారి

ఇంటికే సంక్షేమ పథకాలు



వలంటీర్లు ఇంటికే వచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. గతంలో అయితే అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల చుట్టూ తిరుగాల్సివచ్చేది. సచివాలయం మా కాలనీలోనే ఉన్నందున ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే పథకాలు అందుతున్నాయి. నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ వాణి ఎంతో సహకారం అందిస్తున్నారు.

–బొడ్డేపల్లి హేమలత

ఘనంగా రామానుజన్ జయంతి



రామానుజన్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గణత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావుల్లో రామానుజన్ ఒకరని కొనియాడారు. విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ఎం. ఉదయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

- గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణితంపై పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసి కృషిని కొనియాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఆదిశేషు, ఎ.వెంకటరమణ, చుక్కబాబు, శిరీష పాల్గొన్నారు.

మల్కాపురం పోలీస్‌స్టేషన్ సందర్శించిన ఏసీపీ



రికార్డులను తనిఖీ చేస్తున్న హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్

మల్కాపురం: వార్షిక తనిఖీల్లో భాగంగా హార్బర్ డివిజన్ ఏసీపీ మోసెస్‌పాల్ శుక్రవారం మల్కాపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహిస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్కాపురం పోలీసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బద్రీనాథ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నానాజీ

సింధియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీ షిప్‌యార్డ్ కళాశాల మైదానంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమమైంది. క్రికెట్ పోటీలను ట్రేడ్ యూనియన్ రీజనల్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 40, 61, 62 వార్డు కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, నాయకులు భోగవిల్లి నాగభూషణం క్రికెట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సోమాదుల సురేష్, సూరాడ అనుదీప్, శంకర్, భీశెట్టి గణేష్, దాసరి రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు మ్యాచ్‌లు...

తొలిరోజు 40, 61, 62 వార్డుల నుంచి 6 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. మిగిలిన టీమ్‌లకు శనివారం పోటీలు నిర్వహించనున్నారు.

జింక్ మైదానంలో..

మల్కాపురం: సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జింక్ క్రీడా మైదానంలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు ముర్రు నానాజీ టాస్ వేసి ప్రారంభించారు. బెన్ని బాయిస్,నానాజీ లెవన్స్ జట్లు గెలు పొందాయి. శని,ఆదివారాలు కూడా మ్యాచ్‌లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రాజభాష అమల్లో టోలిక్ కృషి అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎండీ, డైరెక్టర్ తదితరులు

ఉక్కునగరం: రాజభాష హిందీ అమలుకు టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్) చేస్తున్న కృషి అభినందనీయమని టోలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో 2023–24 మొదటి అర్ధ సంవత్సరంలో రాజభాష అమలులో టోలిక్ కార్యాలయాల పనితీరుపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23లో విశాఖపట్నం ఉత్తమ టోలిక్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. సభ్య సంస్థలు సాధించిన పురోగతిని అధికార భాష అమలు డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ కొనియాడారు.

ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిందీ ఇన్ హౌస్ మ్యాగజైన్ 'సుగంధ్' తాజా సంచికను ఆవిష్కరించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, టోలిక్ మెంబర్ సెక్రటరీ లలన్‌కుమార్, ఉక్కు రాజభాష ఏజీఎం టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో క్రిస్మస్ సందడి



బాజీ జంక్షన్ వద్ద దుకాణంలో స్టార్‌లు



క్రిస్మస్ స్టార్ కొనుగోలు చేస్తున్న దృశ్యం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. శనివారం నుంచి ఈ నెల 25 వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా ఎన్‌ఏడీ సెంటర్‌లోని చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సెయింట్ థామస్ చర్చి, యునైటెడ్ క్రైస్ట్ చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. మరో పక్క క్రిస్మస్ పండగకు అవసరమైన సామగ్రి, కొత్తబట్టలు కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడుతోంది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. జీవీఎంసీ 90 వార్డు లక్ష్మీనగర్ -ఎఫ్ బ్లాక్‌లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

- బుచ్చిరాజుపాలెంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో రవీంద్ర భారతి స్కూల్లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.
- 52వ వార్డు శాంతినగర్ పార్కులో సచివాలయ ఏఎన్ఎం తార ఆధ్వర్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఐఐఏఎంలో 'పినాకిల్-2023' సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం)లో శుక్రవారం పినాకిల్-2023 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డబ్ల్యూఎన్ఎస్ సెంటర్ హెడ్(విశాఖపట్నం) ఆర్.ఎల్.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. ఏకాగ్రత, క్రమశిక్షణతోపాటు విభిన్న అంశాలపై నైపుణ్యం, అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ దిశగా యువత శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ సుంకర రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఆర్టీసీ ఉద్యోగుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన ఉద్యోగులను సత్కరిస్తున్న సాయి తులసి తదితరులు

గోపాలపట్నం: సింహాచలం ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగులు రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన పోటీల్లో కండక్టర్ కేఆర్ బాబు 100 మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 400 మీటర్ల రిలే పరుగు పందాల్లో బంగారు పతకం సాధించాడు. అలాగే డ్రైవర్‌గా పని చేస్తున్న డి. గోవింద్ 400 మీటర్ల రిలే పరుగులో బంగారు పతకం సాధించాడు. వీరిని సింహాచలం డిపోలో శుక్రవారం అసిస్టెంట్ డిపో మేనేజర్ సాయి తులసి, యూనియన్ ప్రతినిధులు, సహచర ఉద్యోగులు వీరిని ఘనంగా సత్కరించి అభినందించారు.

నృత్యరూపకం.. అద్భుతం



అర్ధశాంకరం కూచిపూడి నృత్యరూపకంలోని సన్నివేశం

మద్దిలపాలెం: అర్ధశాంకరం కూచిపూడి నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శివపార్వతులను సాక్షాత్కరింపజేసేలా అద్వితీయంగా నాట్యం చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కళాభారతి డ్యాన్స్ ఫెస్టివల్-2023 ప్రారంభమైంది. ఈ వేడుకలను ముఖ్య అతిథిగా స్వామి శ్యాసంవేద్యనంద మహారాజ్ , వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు, పైడా క్రిష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య గురువు వాడంటే కిరణ్ శిష్య బృందం ప్రదర్శించిన అర్ధశాంకరం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం కనువిందుగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత మంతెన సత్యనారాయణరాజు సౌజన్యంలో ప్రదర్శించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

జిందాల్‌తో ఎంవోయూ రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- వివిధ విభాగాధిపతులకు వినతులు

ఉక్కునగరం: జిందాల్‌తో జరిగిన ఎంవోయూను రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ ఆధ్వర్యంలో విభాగాదిపతుల కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు 1044 రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ఉక్కు యాజమాన్యం ఈవోఐ పేరిట జిందాల్‌తో రూ. 500 కోట్లకు రెండేళ్ల ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఎంవోయూ చేసుకోవాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మూడు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.